ఎస్వీజేసీలో ఫ్రెషర్స్ డే హంగామా

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 31: జిల్లా కేంద్రంలోని ఎస్వీజేసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ వెంకటరమణ హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఎస్వీజేసీ విద్యాసంస్థల సెక్రటరీ ఊట్కూరి మహిపాల్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకట వరప్రసాద్, కాంతాల రామ్ రెడ్డి, జాన్సన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, కోరా స్కూల్ డైరెక్టర్ వంగల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అటెండర్‌కు కలెక్టర్ సన్మానం

కలెక్టరేట్, ఆగస్టు 31: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అటెండర్ నేదునూరి లచ్చయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను కలెక్టర్ పమేలా సత్పతి సన్మానించారు. లచ్చయ్య నిబద్ధతతో, అందరితో స్నేహభావంతో ఉంటూ క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని, ఆయన స్ఫూర్తితో ఉద్యోగులు పని చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 5 స్మార్ట్ టీవీలు అందించడంపై కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కె. మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, లచ్చయ్య కుటుంబ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

చిగురుమామిడి, ఆగస్టు 31: ఇందుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఇనుకొండ వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఖాజా మొయినొద్దీన్, తహసీల్దార్ రమేశ్, మాజీ జడ్పీటీసీలు గీకురు రవీందర్, అందె స్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హాజరై, కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అన్ని గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవోలు రాజశేఖర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ అన్ని శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లి, సోదరుడు భూమి ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

రాంనగర్, ఆగస్టు 31: కన్నతల్లి, సోదరుడు తనకు రావలసిన వాటా భూమిని ఇవ్వకుండా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. నగరంలోని శివాజీ నగర్‌లో ఉంటున్న కొప్పుల కీర్తన, చంద్రకాంత్ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. చంద్రకాంత్‌కు కరీంనగర్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో 59 గుంటల భూమి ఉంది. ఈ భూమిలో చంద్రకాంత్ అన్న చంద్రశేఖర్ 8 గుంటలను తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కాగా, తల్లి, సోదరుడు కలిసి తనకు అన్యాయం చేశారని చంద్రకాంత్ పలుమార్లు పంచాయితీ పెట్టినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆగస్టు 24న వల్లంపహాడ్‌లో పంచాయితీకి వెళ్లిన అతడు, భార్య కీర్తనకు ఫోన్ చేశాడు. తన తల్లి, సోదరుడు భూమి రిజిస్ట్రేషన్ చేయబోమని తనను బెదిరించారని, చావు తప్ప తనకు వేరే మార్గం లేదని, గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్‌లో తెలిపాడు. వెంటనే కీర్తన బంధువులతో కలిసి అపస్మారక స్థితిలో ఉన్న చంద్రకాంత్‌ను కరీంనగర్‌లోని హాస్పిటల్‌కు, అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు చేతులెత్తేయడంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న చంద్రకాంత్‌ను వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

రాంనగర్ ఆగస్టు 31: గణేశ్ నవరాత్రులను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ–2024 పేరుతో సమన్వయ సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనరేట్ పరిధిలోని 16 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఉత్సవ్ కమిటీ సభ్యులందరూ ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని, మండపాల వద్ద 24 గంటల పాటు వలంటీర్లు ఉండాలని, అక్కడి కార్యక్రమాలకు పూర్తి బాధ్యత వహించాలని, శాంతి, సామరస్యాలను కాపాడేందుకు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీపీ అభిషేక్ మొహంతి అన్ని శాఖల అధికారులు, హిందూ సంఘాలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంపై చర్చించారు. ఉత్సవ్ కమిటీ సభ్యులు మండపాల సమాచారం, దరఖాస్తు పత్రాలను స్థానిక పోలీసులకు సమర్పించాలని కోరారు. విగ్రహాల నిమజ్జనం వరకు మండపాల వద్ద భద్రత, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభ్యులు తమ ఇంటిమేషన్ ఫారమ్‌లను సరైన వివరాలు తెలుపుతూ సకాలంలో ఇవ్వాలని, సంఘ విద్రోహ శక్తులను ఆర్గనైజింగ్ కమిటీల్లో భాగం చేయవద్దని కోరారు. అంతకు ముందు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌ప్రపుల్ దేశాయ్, ఉత్సవ కమిటీ సభ్యులు 200 మంది పాల్గొన్నారు.

కొత్తపల్లి బ్రిడ్జి ప్రారంభం

కొత్తపల్లి, ఆగస్టు 31 : కొత్తపల్లి మండలకేంద్రంలో రూ.2.65 కోట్లతో కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో కొత్తపల్లి, మల్కాపూర్, లక్ష్మీపూర్, చింతకుంటతో పాటు కరీంనగర్ నగరవాసులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని, ముఖ్యంగా రైతులు, మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్ వాసాల రమేశ్ పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ వేగంగా పూర్తి చేయాలి

కరీంనగర్ రూరల్/ ఇల్లందకుంట/ శంకరపట్నం, ఆగస్టు 31: రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను వేగంగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం నగునూర్, దుర్శేడ్ రైతు వేదికలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఏడీఏ రణధీర్‌తో కలిసి పర్యవేక్షణ చేశారు. యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సత్యం, ఏఈవో పైడితల్లి, ఉదయ్, జఫర్‌ఉల్లా, రైతులు పాల్గొన్నారు. అలాగే ఇల్లందకుంట రైతు వేదికలో హుజూరాబాద్ ఏడీఏ సునీత, శంకరపట్నం మండలంలో కేశవపట్నం క్లస్టర్ రైతు వేదికలో మానకొండూర్ ఏడీఏ ఎన్ శ్రీధర్ రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదును పరిశీలించారు.

అక్రమణ నిర్మాణాలను కూల్చివేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 31: హైడ్రా తరహాలోనే జిల్లాలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కోరారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో చెరువుల శిఖం భూముల ఆక్రమణలను గుర్తించేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేసి 15 రోజుల్లో వివరాలను రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కొయ్యడ సృజన్‌కుమార్, రాజు, సదాశివ, అశోక్ పాల్గొన్నారు.

కార్మికులకు పారిశుధ్య సామగ్రి పంపిణీ

కార్పొరేషన్, ఆగస్టు 31 : నగరంలోని 12వ డివిజన్‌లో కార్మికులకు పారిశుధ్య సామగ్రిని శనివారం స్థానిక కార్పొరేటర్ తోట రాములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్ నాగరాజ్ పాల్గొన్నారు.

సరస్వతీమాత విగ్రహప్రతిష్ఠాపన

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 31 : వాసవీ క్లబ్ వనిత కరీంనగర్ ఆధ్వర్యంలో శిశుమందిర్‌లో సరస్వతీ మాతా విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ రవి చంద్రన్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని డాక్టర్ సత్య విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇక్కడ వాసవీ క్లబ్ వనిత గవర్నర్ జంధ్యం మాధవి, డిస్ట్రిక్ట్ కంట్రోల్ సెక్రటరీ జంధ్యం మధుకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చందా రవీందర్, ప్రెసిడెంట్ చందా విజయలక్ష్మి, పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజినీర్ కోల అన్నారెడ్డి, సమితి కార్యదర్శి ఎలగందల సత్యనారాయణ, అక్కినపల్లి నాగరాజు, సామ లక్ష్మణ్, బ్రిలియంట్ సంస్థల అధినేత సిరిపురం సత్యనారాయణ, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 31: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి శోభాయాత్ర కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బాణాల రవీందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

కమాన్‌చౌరస్తా/శంకరపట్నం/చొప్పదండి, ఆగస్టు 31 : చివరి శ్రావణ శనివారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామి వారు శ్వేత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటి లిపాది గోత్రనామాలపై అర్చనలు చేయించి, దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది మహేందర్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ శివాలయంలో మహా శివుడికి లక్ష బిల్వపత్రార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు బంగిమఠమం శివప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. చొప్పదండి పట్టణంలోని శ్రీ భక్త ఆంజనేయ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ జ్ఞాన సరస్వతీ సేవా దళ్, శ్రీహనుమాన్ భక్తజన మండలి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా సంధ్యారాణి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 31 : జిల్లా విద్యాశాఖలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా కె. సంధ్యారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల క్రితం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఏ కృష్ణారావు ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. కాగా, గతంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్ నరసింహస్వామి ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

6న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 31 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ మైదానంలో ఈనెల 6న సబ్ జూనియర్స్ బాయ్స్ టోర్నమెంట్, సెలెక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ నెల 14 నుంచి 15 వరకు వరంగల్ జిల్లా హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని అసోసియేషన్ ప్రతినిధులు నమిలికొండ ప్రభాకర్, మూల వెంకటేశ్ పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441925807 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లాజిస్టిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 31: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని రీజియన్ లాజిస్టిక్ మేనేజర్ రామారావు సూచించారు. నగరంలోని కోతిరాంపూర్‌లో లాజిస్టిక్ నూతన కౌంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో గల లాజిస్టిక్ కేంద్రంలో వినియోగదారులు డెలివరీ తీసుకోని వస్తువులను ఈ నెల 2న వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ టీం లీడర్ రాజు ఉన్నారు.

'హాస్టల్ విద్యార్థుల భోజనానికి 37 రూపాయలేనా?'

కలెక్టరేట్, ఆగస్టు 31 : ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల సంక్షేమమే ధ్యేయమంటూ చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఆవాసముంటున్న వారి భోజనానికి మాత్రం రోజుకు రూ.37 మాత్రమే ఖర్చు చేయడం శోచనీయమని గౌట్ హాస్టల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ వీ రాములు అన్నారు. శనివారం నగరంలోని భగత్‌నగర్‌లోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు.

బీపీఈడీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 31 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టులో ఈ పరీక్షలు నిర్వహించగా, ఫలితాలు www.satavahana.ac.in, http://103.119.113.107:89. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 31: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 2న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్ సమావేశం మందిరంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాకేశ్‌చారి, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ్, నాయకులు సంపత్‌గౌడ్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

తెలంగాణచౌక్, ఆగస్టు 31: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో శనివారం ప్లాట్ ఫాం 14 వద్ద శ్రీనివాస్ అనే ప్రయాణికుడి జేబులోనుంచి సెల్‌ఫోన్ దొంగలించి పారిపోతున్న సతీశ్ అనే వ్యక్తిని ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్ఐ లక్పతి, కానిస్టేబుల్ రమణ, సెక్యూరిటీ గార్డు కవిత పట్టుకున్నారు. అతడి నుంచి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని దొంగను వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

గుడాటిపల్లెలో అర్ధరాత్రి ఇంట్లో చోరీ

శంకరపట్నం, ఆగస్టు 31: మొలంగూర్ గ్రామ పరిధిలోని గుడాటిపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. గుడాటిపల్లెకు చెందిన గుర్రాల సంజీవరెడ్డి తన భార్య విజయతో కలిసి మనుమడి పుట్టిన రోజు వేడుకలకు శుక్రవారం కరీంనగర్‌కు వెళ్లారు. వేడుకలు పూర్తయ్యాక రాత్రి అక్కడే నిద్రించి శనివారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండడంతో అవాక్కయ్యారు. ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన రెండు తులాల బంగారు, వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీం అధికారులు ఆధారాల కోసం ఇళ్లంతా జల్లెడ పట్టారు. ఇంటి యజమాని గుర్రాల సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే రవి తెలిపారు.

కాలుపై నుంచి వెళ్లిన లారీ: తీవ్రగాయాలతో యువకుడి మృతి

చొప్పదండి, ఆగస్టు 31: పట్టణంలో జరిగిన ప్రమాదంలో చాకుంట గ్రామానికి చెందిన దాసరి సంజీవ్ (26) మృతిచెందాడు. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి సంజీవ్ తన మోటార్ సైకిల్‌పై శుక్రవారం ఇంటి నుంచి బయలు దేరి చొప్పదండికి వచ్చాడు. రాత్రి చొప్పదండి శివారులోని భారత్ పెట్రోల్ బంకు వద్ద చేరుకునేసరికి సంజీవ్ మోటార్ సైకిల్ పాడైపోయింది. దానిని పెట్రోల్ బంక్ దగ్గర పెట్టుకొని, వర్షం పడుతుండడంతో అక్కడే ఉన్న గుర్తుతెలియని లారీ వెనుక కూర్చొని ఉన్నాడు. శనివారం ఉదయం నాలుగు గంటలకు డ్రైవర్ లారీని అజాగ్రత్తగా నడుపగా వెనుక టైర్లు సంజీవ్ కుడికాలు పైనుంచి వెళ్లడంతో కాలు విరిగింది. వెంటనే అతడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, సంజీవ్ మృతి చెందాడు. అతడి అన్న దాసరి అనిల్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ విరమణ పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు

రాంనగర్ ఆగస్టు 31: కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై జి. సాంబయ్య, ఏఎస్సైలు, అహ్మదుల్లఖాన్, ఐ. లక్ష్మీరెడ్డి, కె. పోచయ్య, హెడ్ కానిస్టేబుల్ డి.మల్లారెడ్డిని కరీంనగర్ అడిషనల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడాల సురేందర్, రిజర్వు ఎస్సై తిరుపతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం పట్టణ ఉపాధ్యక్షుడిగా అజయ్

తెలంగాణచౌక్, ఆగస్టు 31: బీసీ విద్యార్థి సంఘం పట్టణ ఉపాధ్యక్షుడిగా అజయ్ నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తనను పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, సహకరించిన బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలి

చిగురుమామిడి, ఆగస్టు 31 : ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను ప్రభుత్వం వెంటనే ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, జోన్ కన్వీనర్ కాసుగంటి రాజమౌళి, రాష్ట్ర కౌన్సిలర్ టి.తిరుపతి కోరారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, జూలై 2023 వరకు అమలు చేయాల్సిన పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఐబీఎం స్టూడెంట్ డెవలపర్ ప్రోగ్రాంపై వర్క్‌షాప్

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎడ్యునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ లక్ష్మణరావు

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 31 : మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో శనివారం బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐబీఎం స్టూడెంట్ డెవలపర్ ప్రోగ్రాంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిని చైర్మన్ సాగర్‌రావు, సెక్రటరీ సుమిత్ సాయి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఈ వర్క్‌షాప్ ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌తో సహా అనేక రంగాల్లో అత్యంత డిమాండ్ ఉన్న ఐటీ నైపుణ్యాలను ఐబీఎం సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం ద్వారా ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎడ్యునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ లక్ష్మణరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు 20 భాషల్లో 200 ఉచిత కోర్సులపై పట్టు సాధించాలని చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. సెక్రటరీ కరస్పాండెంట్ సుమిత్ సాయి మాట్లాడుతూ, ఐబీఎం స్కిల్స్ బిల్డ్ మాడ్యూల్స్ ఇంటరాక్టివ్ ప్రాజెక్ట్‌లు, వాస్తవ–ప్రపంచ దృశ్యాలను అందిస్తాయని, ఇవి విద్యార్థులకు సంక్లిష్టమైన అంశాలను అర్థం చేసుకోవడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రావు, అకాడమిక్ డీన్ పీకే వైశాలి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జగదీశన్, కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి: సీపీ

రాంనగర్, ఆగస్టు 31: భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలని సీపీ అభిషేక్ మొహంతి పోలీసులను ఆదేశించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించి వారిపై రౌడీ షీట్లు తెరవాలని సూచించారు. కమిషనరేట్‌లోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా భూ ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ఫిర్యాదులపై స్పందిస్తూ విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకొని పలు కేసుల్లో బాధితులకు న్యాయం కోసం కృషి చేస్తున్నందుకు కరీంనగర్ రూరల్ ప